# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వికసిత భారత్‌తో పాటు వికసిత ఆంధ్రప్రదేశ్ సాధించడమే ఎన్డీఏ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **సార్వత్రిక ఎన్నికల ప్రకటన విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళినీ ఖచ్చితంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలకు ఎన్నికల సంఘం 46 వేల 165 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.**
4. **ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో ఈరోజు నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి.**
5. **ఆయుధ కర్మాగార దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

వికసిత భారత్‌తో పాటు వికసిత ఆంధ్రప్రదేశ్ సాధించడమే నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ ....ఎన్డీఏ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. భారతీయ జనతా పార్టీ , తెలుగు దేశం, జన సేన పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్‌లోని చిలకలూరిపేట పట్టణం బొప్పూడి గ్రామం వద్ద ప్రజా గళం పేరుతో నిన్న నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ .... ఆంధ్రరాష్ట్ర వికాసానికి తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు కె. పవన్ కళ్యాణ్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్.డి.ఎ. కూటమికి 4 వందలకు పైగా స్థానాలు వచ్చేలా ఘన విజయం చేకూర్చి పెట్టాలని ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విజ్ఞప్తి చేశారు. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ , కాంగ్రెస్ పార్టీ రెండూ ఒకటేనని విమర్శించారు. ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ ఇప్పటి వరకూ అనేక పథకాలు అమలు చేసిందని నరేంద్ర మోడీ వివరిస్తూ .....

..... వాయిస్..... 27సెకన్లు

--------------------------------

చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ..... ఆంధ్రప్రదేశ్ ప్రజల వాణిని వినిపించడానికే తెలుగు దేశం, జన సేన ,భారతీయ జనతా పార్టీలు పొత్తు కుదుర్చుకున్నాయనీ, వికసిత భారత్ సాధించడానికి ఇదే సరైన

సమయమనీ అన్నారు. అందుకు అందరం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి అండగా ఉండాలని చంద్రబాబు నాయుడు సూచిస్తూ.......

.....వాయిస్....25 సెకన్లు

పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ..... అభివృద్ధి లేక, జనరంజక పాలన లేక తీవ్రంగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్‌కు తెలుగు దేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల పొత్తు ఎంతో బలాన్ని ఇస్తోందని తెలిపారు. వచ్చే ఎన్నికలలో ఎన్.డి.ఎ. కూటమి ఘన విజయం సాధిస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

---------------------------

చిలకలూరిపేట వద్ద నిర్వహించిన ఎన్.డి. ఎ. కూటమి నిర్వహించిన ప్రజా గళం సభకు విశేష స్పందన వచ్చిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్.డీ.ఎ. కూటమికి పూర్తి మద్దతుగా వున్నారనీ, అవినీతి మయమైన వై ఎస్ ఆర్. కాంగ్రెస్ పాలనకు విముక్తి కల్పించి తెలుగు దేశం, జన సేన, భారతీయ జనతా పార్టీల కూటమి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకు వెడుతుందనీ ప్రజలు బలంగా నమ్ముతున్నారని నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లోని చిలకలూరిపేట వద్ద ప్రజా గళం పేరుతో తెలుగు దేశం , జన సేన, భారతీయ జనతా పార్టీలు నిర్వహించిన బహిరంగ సభ పూర్తిగా విఫలమైందని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ...... గతంలో భారతీయ జనతా పార్టీని విమర్శించిన తెలుగు దేశం ... జన సేన పార్టీలకు ఇప్పుడు ఆ పార్టీతో ఎన్నికల పొత్తు కుదుర్చుకోవడం విచిత్రంగా ఉందని అన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీతో భారతీయ జనతా పార్టీ స్నేహం చేసి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ఆశ్చర్యంగా ఉందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల విమర్శించారు. కాంగ్రెస్ పార్టీపై భారతీయ జనతా పార్టీ అనవసర విమర్శలు చేస్తోందని షర్మిల వ్యాఖ్యానించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు తెలంగాణలో పర్యటించనున్నారు. జగిత్యాలలో జరిగే బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. ఈ సభకు భారీ భద్రతా ఏర్పాట్లు చేశామనీ, 1,600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామనీ.. పోలీసు అధికారులు తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల ప్రకటన విడుదలైన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళినీ ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు అంశంపై వెలగపూడి సచివాలయం నుండి దృశ్య మాధ్యమం ద్వారా జిల్లాల కలెక్టర్లతో నిన్న ఆయన మాట్లాడుతూ ..... క్షేత్ర స్థాయిలో ఎన్నికల నిర్వహణా బృందాలు విస్తృతంగా పర్యటిస్తూ రాజకీయ పార్టీలు ఎన్నికల నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించేలా చూడాలని దిశా నిర్దేశం

చేశారు. సి- విజిల్‌లో అందే ఫిర్యాదులను వంద నిముషాల లోపు పరిష్కరించాలనీ,

ఎన్నికల సంఘం నుండి అందే ఫిర్యాదులను ఏ రోజుకు ఆ రోజు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు ...., బహిరంగ ప్రదేశాలలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రాజకీయ ప్రకటనలను తక్షణమే తొలగించాలని సూచించారు. జాతీయ నాయకుల విగ్రహాలు మినహా మిగిలిన నాయకుల విగ్రహాలు కనిపించకుండా వస్త్రాలు కప్పి ఉంచాలని ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఇలా ఉండగా .... ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రకటించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్ సభ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా 46 వేల 165 పోలింగ్ స్టేషన్ లను ఏర్పాటు చేస్తోంది. పోలింగ్ కేంద్రాలను సగటున 887 మంది ఓటర్లు ఉన్నారు. కేవలం మహిళా సిబ్బంది మాత్రమే ఉండేలా 179 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. యువ ఓటర్లకు 50 పోలింగ్ బూత్ లు, దివ్యాంగ ఓటర్లకు 63 , ఇవి కాకుండా 555 మోడల్ పోలింగ్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. 85 సంవత్సరాలు నిండిన ఓటర్లకు ఇంటి నుండే ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరొక వైపు ..... రాష్ట్ర వ్యాప్తంగా ఈ సారి పోలీసు సిబ్బంది కాకుండా 3 లక్షల 82 వేల 218 మంది ప్రభుత్వ సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో ఈరోజు నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు నుండి ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల 473 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది. పదవ తరగతి ప్రధాన పరీక్షలు మార్చి 28 వ తేదీతో ముగుస్తాయి. మిగతా రెండు రోజులలో ఓరియంటల్, ఒకేషనల్ పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల 23 వేల 92 మంది విద్యార్థులు ఈ పరీక్షల కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కాగా ...., తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నుండి ఏప్రిల్ రెండవ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షల కోసం మొత్తం 2 వేల 676 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సారి పరీక్షలకు 5 లక్షల 8 వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. పరీక్షలకు నిముషం ఆలస్యమైనా అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

---------------------------

భారత దేశాన్ని రక్షణ పరంగా అభివృద్ధి చేయడంలో ఆయుధ కర్మాగారాలు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తు చేసుకుంటూ ఈరోజు ఆయుధ కర్మాగార దినోత్సవం నిర్వహిస్తున్నారు. భారత దేశం వలస పాలనలో వున్న సమయంలో 1801వ సంవత్సరం మార్చి 18 వ తేదీన కోల్‌కత్తాలోని కాస్సి పోర్ లో ఆర్డనెన్సు ఫాక్టరీని ఏర్పాటు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ రోజు రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి .... జాతీయగీతాన్ని ఆలపించడం , ఆర్డినెన్సు ఫాక్టరీ ఉత్పత్తులను ప్రజలకు అవగాహన కలిగే రీతిలో ప్రదర్శించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

---------------------------

రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ స్వచ్ఛమైన పాలన అందిస్తోందని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ... విధి నిర్వహణలో ఉద్యోగులకు స్వేచ్ఛను ఇచ్చామనీ, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు ఆదరిస్తున్నారనీ అన్నారు. ఇప్పటి వరకు 26 కోట్ల మంది మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. 32 లక్షల కుటుంబాలు రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అందుకున్నాయని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలలకు ఈరోజు నుండి ఒంటి పూట బడులు ప్రారంభమవుతాయి. ఒంటి పూట బడుల నేపథ్యంలో పాఠశాలల యాజమాన్యాలకు రాష్ట్ర విద్యా శాఖ పలు కీలక సూచనలు చేసింది. ఎండల కారణంగా పాఠశాలలలో తగినంతగా తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించింది.

======================